## ఎంజీఎం హాస్పిటల్‌లో ఫీవర్ వార్డు

### కొవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఏర్పాటు


ఫీవర్ వార్డును పరిశీలిస్తున్న వైద్యాధికారులు

వరంగల్ చౌరస్తా, మే 27 : దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఎంజీఎం హాస్పిటల్‌లో ఫీవర్ వార్డును ఏర్పాటు చేశారు. మంగళవారం ఎంజీఎం హాస్పిటల్ ఆర్థోపెడిక్ వార్డు భవనంలో 15 పడకలతో ఫీవర్ వార్డు సిద్ధం చేశారు. తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ తీసుకుంటున్న ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఎంజీఎంలోనూ ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేస్తే పడకల సంఖ్యను పెంచడంతో పాటు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

---

**వరంగల్ నగరానికి ఈసారీ ముంపు ముప్పు పొంచి ఉందా?** అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఏటా వరదలు ముంచెత్తినా బల్దియా శాశ్వత నివారణ చర్యలు చేపట్టకపోవడం ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. రెండేళ్ల క్రితం ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించిన అప్పటి మంత్రి కేటీఆర్.. శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలని.. అవసరమైన డీపీఆర్‌లు సమర్పించాలని సూచించినా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రెండు, మూడు సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకొన్నది. గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 250 కోట్ల నిధులు బల్దియా వినియోగించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఈ విషయమై దృష్టి సారించకపోవడం.. నాలా విస్తరణ పనులు నత్తనడకన సాగడం.. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారడం.. భద్రకాళీ చెరువు పూడికతీత పూర్తికాకపోవడం.. ఈసారి ముందే వర్షాలు కురుస్తుండడంతో నగర ప్రజలు మరోసారి ముంపు తప్పదా? అనే భయాందోళనకు గురవుతున్నారు. - వరంగల్ /కరీమాబాద్, మే 27


అసంపూర్తిగా పోతననగర్ నాలా విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం

- జోరువానతో నగరం జలమయం
- లోతట్టు ప్రాంతాలకు పోటెత్తిన వరద
- పొంగిపొర్లిన డ్రైనేజీలు, మోకాళ్లోతు నీటితో జనం ఇక్కట్లు
- అక్కడక్కడా కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- క్రమంగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా** మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కుండపోత పోసినట్లు వానకు వరంగల్ నగరం, మహబూబాబాద్, ఏటూరునాగారం సహా పలు ప్రాంతాల్లోని రహదారులు, లోతట్టు కాలనీలకు వరద పోటెత్తింది. వరంగల్ సీకేఎం హాస్పిటల్‌కు వెళ్లే రహదారిపై మోకాళ్ల లోతు వర్షం నీరు చేరింది. వరంగల్ అండర్‌బ్రిడ్జి, సీకేఎం హాస్పిటల్ ఏరియాల్లో మోకాళ్లోతు వరద రావడంతో జనం ఇబ్బందులు పడ్డారు. హనుమకొండ బస్‌స్టేషన్, మహబూబాబాద్ జిల్లాకేంద్రం స్టేషన్‌రోడ్డులోని అండర్ బ్రిడ్జ్ ఏరియాలో వరద ప్రవాహానికి వాహనదారులు ముందుకు వెళ్లలేకపోయారు. అలాగే జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లోకి నీరు చేరడంతో ధాన్యం ముద్దయ్యింది. - నమస్తే నెట్‌వర్క్, మే 27


హనుమకొండ కాకాజీ కాలనీలో రోడ్డుపై వర్షపు నీరు

# కుండపోత

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ వర్షం


చిల్పూరు: కొనుగోలు కేంద్రంలో వరదకు కొట్టుకుపోతున్న ధాన్యం

- జోరువానకు నగరం అతలాకుతలమైంది. వరంగల్ సీకేఎం హాస్పిటల్‌కు వెళ్లే రోడ్డు మోకాళ్ల లోతు వర్షం నీరు చేరి గర్భిణులు అతి కష్టం మీద నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. వరంగల్ అండర్‌బ్రిడ్జి, చిన్న బ్రిడ్జిల కింద వరద పోటెత్తడంతో వాహనదారులు బ్రిడ్జి దాటేందుకు ఇబ్బందులు పడ్డారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు కాలనీలకు వరద నీరు చేరగా లక్ష్మీనగర్, సాకరాశికుంట, కాశీకుంట, హంటర్‌రోడ్డులోని పలు కాలనీలలోకి వర్షం నీరు చేరి డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వరంగల్ చౌరస్తా, మేదరివాడ, హెడ్ పోస్టాఫీస్ రోడ్లు వరద నీటితో నిండిపోయాయి. హనుమకొండలోని బస్‌స్టేషన్, కాకాజీ కాలనీ ప్రాంతాలు జలమయం అయ్యాయి. అలాగే శాయంపేట, నల్లబెల్లిలోనూ భారీ వర్షం కురిసింది.
- మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని రామచంద్రాపురంకాలనీ, గోకుల మల్లయ్య బజార్, హనుమంతుని గడ్డ ఏరియాలో రోడ్లపై వర్షం నీరు నిలిచింది. స్టేషన్ రోడ్డులోని అండర్ బ్రిడ్జ్‌లో వర్షం నీరు చేరింది. బ్రిడ్జ్ పక్కన వరద ఉండడంతో పాత బజార్‌కు వెళ్లే ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందిపడ్డారు. దంతాలపల్లి, నర్సింహులపేట, కేసముద్రం, గూడూరు, బయ్యారం తదితర చోట్ల భారీ వర్షం కురిసింది.
- జనగామ జిల్లా చిల్పూరు, పల్లగుట్ట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. లారీలు సరిగ్గా రాక, ధాన్యం నింపేందుకు బస్తాలు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాల్లో వర్షం దంచికొట్టింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని పలు గ్రామాల్లో వరద నీరు చేరింది. కుదురుపల్లి వాగు వరద నీటితో ప్రవహించింది. కాటారం మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పల చుట్టూ నీరు నిలిచింది. మల్హర్ మండలం కొయ్యూర్‌లో ధాన్యం తడిసింది. ములుగు జిల్లా ఏటూరునాగారంలోని కొనుగోలు కేంద్రాల్లో కుండపోత వర్షం కురిసింది. లారీల్లో ధాన్యం లోడింగ్ చేస్తుండగా ఇబ్బందులు ఎదురయ్యాయి.


సీకేఎం ఆస్పత్రి రోడ్డులో వర్షపు నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న గర్భిణి


పోచమ్మమైదాన్ : తిలక్‌రోడ్డులో వర్షపు నీరు


వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద..


మహబూబాబాద్‌లో కురుస్తున్న వర్షం


హనుమకొండ బస్టాండ్‌లో గుంతలో పడిన వాహనదారుడు

### సమ్మక్కబరాజ్ వద్ద పెరిగిన నీటిమట్టం

కన్నాయిగూడెం, మే 27 : తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి గోదావరిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో బరాజ్ వద్ద నీటిమట్టం 76.30 మీటర్లకు చేరుకుంది. ఎగువ నుంచి 4860 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఒక గేటును ఎత్తి 3వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

---

- శాశ్వత ముంపు నివారణపై దృష్టి సారించని బల్దియా
- గత ప్రభుత్వ నిధులు వినియోగించుకోవడంలోనూ విఫలం
- కనీసం డీపీఆర్‌లు సమర్పించని అధికార యంత్రాంగం
- ప్రస్తుతం నాలాల పూడికతీతతోనే సరిపెడుతున్న అధికారులు
- నత్తనడకన కొనసాగుతున్న విస్తరణ పనులు
- అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీలు
- భయాందోళనలో ప్రజలు

# నగరానికి ముంపు ముప్పు?

### నత్తనడకన విస్తరణ పనులు

నగరంలోని నాలాల విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. హనుమకొండలోని నయీంనగర్ నాలా పనులు వేగంగా పూర్తి చేసినా, వరంగల్‌లో పోతననగర్ నాలా పనుల్లో ఆలస్యం జరుగుతున్నది. 12 మోరీల నుంచి పోతననగర్ గుడిసె కాలనీ వరకు నాలా పనులను అస్తవ్యస్తంగా చేస్తున్నారు. ఈ సారి ముందస్తుగానే వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికిప్పుడు నాలా విస్తరణ, డ్రైనేజీ పనులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. అవసరమైన నాలా విస్తరణ, డ్రైనేజీ పనులు పక్కనపెట్టి భద్రకాళీ బండ్ రెండో ప్రవేశ ద్వారం కోసం స్లాబ్ నిర్మాణం చేస్తున్న అధికారుల తీరుపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం భారీ వర్షాలు పడితే రామన్నపేట, పోతననగర్ పూర్తిగా మునిగిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కాశీకుంటలో ఇండ్లలోకి చేరిన వరద నీరు (ఫైల్)

వానకాలం వస్తున్నదంటే నగర వాసులు వణికిపోతున్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రెండేళ్ల కిత్రం నగరం ముంపునకు గురైన సమయంలో అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. శాశ్వత ముంపు నివారణకు ప్రణాళికలు సమర్పించాలని బల్దియా, జిల్లా యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఇందుకోసం రూ.250 కోట్లు ప్రకటించిన కేటీఆర్ ముఖ్యంగా నగరంలోని ప్రధాన నాలాలను రెవెన్యూ, ఇరిగేషన్, బల్దియా శాఖలు సమన్వయంతో సర్వే చేసి వాస్తవ హద్దులు నిర్ణయించాలని సూచించారు. నాలాల విస్తరణ చేపట్టి, రెయిలింగ్‌లు ఏర్పాటు చేయాలని, వరద నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలన్నారు. అయితే అవసరమైన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వం నుంచి అనుమతులు పొందడంలో బల్దియా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వినియోగించుకోకపోవడంలో పూర్తిగా విఫలం కావడంతో రూ. 250 కోట్లు నిరుపయోగంగా మారాయి.

### డ్రైనేజీలు అస్తవ్యస్తం

అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని సాకరాశికుంట నాలా, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో వరదనీరు సాఫీగా వెళ్లే పరిస్థితి లేదు. ఏటా మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ వెనకాల ఉన్న మెట్టు చెరువు నీరు, రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాలు, భట్టుపల్లి, అమ్మవారిపేట, ఉర్సు చెరువుల నుంచి వచ్చే వరదతో అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు కాలనీలు మునుగుతున్నాయి. అలాగే కాశీకుంట, విద్యానగర్‌కాలనీ, జన్మభూమి జంక్షన్ రోడ్డు, సాకరాశికుంట, లక్ష్మీనగర్, ఎస్‌ఆర్‌ఆర్‌తోట ముంపునకు గురవుతున్నాయి. దీంతో పాటు భట్టుపల్లి, అమ్మవారిపేట, శాయంపేట, ఉర్సు చెరువుల నుంచి వచ్చే నీటితో ఎన్‌ఎన్‌నగర్, బీఆర్ నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాలు మునుగుతున్నాయి.

### బొందివాగుపై అదే నిర్లక్ష్యం

వరంగల్ నగర ముంపునకు ప్రధాన కారణంగా నిలుస్తున్న బొందివాగు నాలాపై అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని వరద శాకరాశికుంట నాలా, అమ్మవారిపేట చెరువు వరద నీరు బొందివాగు ద్వారా వెళ్తున్నది. అయితే బొందివాగు ఆక్రమణకు గురికావడంతో వరదంతా ఇండ్లలోకి వస్తున్నది. గతంలోనే బొందివాగును సర్వే చేసి వాస్తవ హద్దులు ఏర్పాటు చేసి విస్తరించాలని సూచించినా బల్దియా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. బొందివాగు వరద ఉధృతి పెరిగితే భద్రకాళీ చెరువులోకి తరలించి కాపువాడ మత్తడి వైపు నుంచి బయటకు వదలాలనే ప్రతిపాదన ఇప్పటికీ కార్యాచరణలోకి రాలేదు. భద్రకాళీ చెరువు పూడికతీత పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో మళ్లీ సాయినగర్, ఎన్‌టీఆర్ కాలనీ, సంతోషిమాత కాలనీ, హంటర్ రోడ్డు ప్రధాన రహదారి ఈసారి కూడా మునగడం ఖాయంగా కనిపిస్తున్నది. అలాగే స్టేషన్ రోడ్డు నుంచి వచ్చే వరదనీరు మేదరవాడ మీదుగా 12 మోరీలకు చేరాల్సి ఉండగా, వరంగల్ చౌరస్తా ప్రాంతంలోని కల్వర్టులో మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయడంతో ఆ ప్రాంతమంతా చిన్న వర్షానికే ముంపునకు గురవుతున్నది.


గుర్రపు డెక్క, పిచ్చి చెట్లతో నిండిపోయిన భట్టుపల్లి, అమ్మవారిపేట, ఉర్సు చెరువుల నుంచి వచ్చే వరద వెళ్లు నాలా

---

- అసంపూర్తిగా రామన్నగూడెం-రాంనగర్ రోడ్డు
- వరద నీటితో మునిగిపోతున్న రహదారి
- రాంనగర్, లంబాడీతండా గ్రామాలకు నిలిచిపోతున్న రవాణా
- ఈసారీ కష్టాలు తప్పవంటున్న ముంపు బాధితులు

## అప్రోచ్ అయ్యేదెలా?


రాంనగర్ వైపు అసంపూర్తిగా ఉన్న అప్రోచ్ రోడ్డు

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం-రాంనగర్ గ్రామాల మధ్య హై లెవల్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. దీనికి సమానంగా ఇరువైపులా నిర్మించాల్సిన అప్రోచ్ రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో వర్షాలకు వరద రోడ్డును ముంచెత్తడంతో రాంనగర్, లంబాడీతండా గ్రామాలకు రవాణా నిలిచిపోయి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. – ఏటూరునాగారం, మే 27

8వ పేజీలో

---

## చిరు వ్యాపారులపై ప్రతాపం

- వ్యాపార సముదాయాలను కూల్చివేసిన బల్దియా అధికారులు
- సమాచారం లేకుండా కూల్చారంటున్న బాధితులు
- మా బతుకు ఆగం చేయొద్దని వేడుకోలు


హనుమకొండ చౌరస్తాలో డబ్బాలను తొలగించిన కార్పొరేషన్ అధికారులు

హనుమకొండ, మే 27: హనుమకొండ చౌరస్తా కేంద్రంగా చిరు వ్యాపారం చేసుకుంటున్న వారి దుకాణాలను ముందస్తు సమాచారం లేకుండా మంగళవారం బల్దియా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కూల్చివేశారు. సుమారు 40కి పైగా షాపులను కూల్చేయగా రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని దుకాణాదారులు కన్నీటి పర్యంతమయ్యారు. 'ఏండ్లుగా ఇక్కడ దుకాణాలు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. మా బతుకులు ఆగం చేయొద్దని వేడుకొన్నప్పటికి కనికరం చూపలేదని' బోరుమని మహిళలు విలపించారు.

**కూల్చివేతలను ఖండిస్తున్నాం**

కాంగ్రెస్ ప్రభుత్వం, బల్దియా అధికారులు చిరు వ్యాపారులపై దాడులు చేసి వ్యాపార సముదాయాలను కూల్చివేయడాన్ని బీఆర్‌ఎస్ పార్టీ చిరు వ్యాపారుల సంఘం నాయకులు నాయిని రవి, ఎండీ ఇస్మాయిల్ ఖండిస్తున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి చిరు వ్యాపారుల సమస్యలు, జీవనోపాధి విషయమై చర్చిస్తున్నప్పటికీ పట్టించుకోకపోగా దాడులు ఎక్కువైపోయాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో వందలాది మంది చిరు వ్యాపారుల జీవితాలు ఆగం అవుతున్నాయని అన్నారు. చిరు వ్యాపారుల ఉపాధి, భద్రత చట్టం ఉన్న వారి హక్కులను పాలకులు కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు.

---

## ఇనుగుర్తికి రూ.కోటీ 25లక్షలు మంజూరు

### మండల అభివృద్ధే ధ్యేయం : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర


ఎంపీ రవిచంద్ర


మంజూరు పత్రాలను అందిస్తున్న ఎంపీ రవిచంద్ర సోదరుడు వద్దిరాజు కిషన్

ఇనుగుర్తి, మే 27 : మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధుల నుంచి రూ.కోటీ 25లక్షలు మంజూరు చేశారు. ఇనుగుర్తి మండల ఏర్పాటుకు కృషిచేసిన ఆయన మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిధులు సమకూర్చి మాట నిలబెట్టుకున్నారు. వాటిలో మండలకేంద్రానికి రూ.20 లక్షలు, చిన్ననాగారం రూ.20లక్షలు, తార్‌సింగ్‌తండా రూ.20 లక్షలు, కోమటిపల్లి రూ.25లక్షలు, చిన్నముప్పారం రూ.15లక్షలు, మీఠ్యాతండా రూ.10 లక్షలు, లక్ష్మీపురం రూ.5లక్షలు, పాతతండా రూ.5లక్షలు, పెద్దతండాకు రూ.5లక్షల చొప్పున ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం కేటాయించగా నిధుల మంజూరు పత్రాలను ఎంపీ రవిచంద్ర సోదరుడు కిషన్ మంగళవారం ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులకు అందించారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ రవిచంద్రకు, సహకరించిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు దీకొండ వెంకన్న, గుండ వెంకన్న, తొర్రూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కసిరబోయిన విజయ్‌యాదవ్, మాజీ సర్పంచ్ దార్ల రామూర్తి, నీలం యాకయ్య, నారాయణరెడ్డి, బానోత్ నరేశ్‌నాయక్, బానోత్ రాజునాయక్, బానోత్ శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య, నామాల మహేశ్, నాయకులు పింగిళి శ్రీనివాస్, పప్పుల వెంకన్న, గుజ్జునూరి బాబురావు పాల్గొన్నారు.


---

## బిల్లుల కోసం వెళ్తే నిర్బంధమా?


దేవరుప్పుల పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచ్‌లు

- సెక్రటేరియట్‌కు వెళ్లకుండా ఎక్కడికక్కడే మాజీ సర్పంచ్‌ల అరెస్టులు
- అదుపులోకి తీసుకుని తరలించిన పోలీసులు
- పలుచోట్ల మాజీ సర్పంచ్‌ల భర్తలు, కుమారులనూ వదలని ఖాకీలు

నమస్తే నెట్‌వర్క్, మే 27 : ఉమ్మడి జిల్లాలో పోలీసులు మాజీ సర్పంచ్‌లను ఎక్కడికక్కడే అరెస్ట్ చేశారు. ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు చేసిన తమకు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని మంగళవారం మాజీ సర్పంచ్‌ల సంఘం చలో సెక్రటేరియట్ పిలుపునిచ్చిన నేపథ్యంలో పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను ఉదయమే అరెస్ట్ చేశారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి మాజీ సర్పంచ్‌ల భర్తలు, కుమారులను కూడా అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అప్పులు చేసి, బంగారం, ఆస్తి కుదువపెట్టి అభివృద్ధి పనులు చేశామని అన్నారు. పెండింగ్ బిల్లుల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించేందుకు వెళ్తున్న తమను అడ్డుకొని ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు